క్లుప్తంగా

గణపతికి అభిషేకం



పిడుగురాళ్ల: పట్టణంలోని నాగులగుడి దేవస్థానంలో గణపతికి సంకష్ట హర చతుర్థి సందర్భంగా మహా అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

అక్రమ మద్యం పట్టివేత



మాచర్ల రూరల్: అక్రమంగా తెలంగాణ నుంచి మద్యం తీసుకొచ్చి విక్రయిస్తున్న వ్యక్తి వద్ద నుంచి 36 బాటిళ్లను స్వాధీన పరచుకున్న ఘటన మండలంలోని తాళ్ళపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కిషోర్ కథనం ప్రకారం నాగార్జున సాగర్, తెలంగాణ రాష్ట్రం నుంచి తాళ్ళపల్లి గ్రామానికి చెందిన కొండా లింగయ్య అనే వ్యక్తి ఆఫీసర్ చాయిస్ విస్కీ 14, మ్యాన్షన్ హౌస్ 12, మరో 10 మద్యం సీసాలు తీసుకొచ్చి గ్రామంలోని శివాలయం సెంటర్ వద్ద విక్రయించేందుకు యత్నిస్తుండగా తమ సిబ్బందితో దాడి చేసి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పాలి

సీఐ శ్రీరాం వెంకట్రావు



పిడుగురాళ్ల: గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పాలని పిడుగురాళ్ల సీఐ శ్రీరాం వెంకట్రావు అన్నారు. మండలంలోని జానపాడు గ్రామంలో బుధవారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో గొడవలు సృష్టించకూడదని, ఎన్నికలు ముగిసాయని, అందరు స్నేహభావంతో మెలిగి ఎవరికి ఎలాంటి హాని జరగకుండా చూడాలని తెలిపారు. గ్రామాల్లో అవాంఛనీయ ఘటనలు జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి విషయం గోప్యంగా ఉంచుతామని అన్నారు. మద్యపానం, మాదక ద్రవ్యాల విక్రయాలు నిర్వహించితే ఉపేక్షించేది లేదన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలు చెడు వ్యసనాలకు బానిసలు అవుతున్నారో లేదో గ్రహించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై పఠాన్ రబ్బానీ ఖాన్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు



పాలువాయి జంక్షన్(రెంటచింతల): మండల పరిధిలోని పాలువాయి జంక్షన్ వద్ద నున్న షిర్డీ సాయి ఆలయంలో గురువారం సాయి బాబాకు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఎంతో మహిమ కలిగిన షిర్డీ సాయినాథుని పూజిస్తే తమ కోరికలు నెరవేరుతాయని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఈ ఆలయానికి చేరుకుని సాయినాథునికి మొక్కులు చెల్లించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ ఆవరణలో భజన బృందం బాబా గీతాలను ఆలపించారు. ఆలయ చైర్మన్ పందిరి శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

సత్తెనపల్లి: హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆదరణ అనాథ వృద్ధుల ఆశ్రమంలో అన్నదానం జరిగింది. అమ్ములూరి ఝాన్సీ కనకరాజ్ పుట్టినరోజు సందర్భంగా గురువారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఝాన్సీ కనకరాజు మాట్లాడుతూ వృద్ధుల సమక్షంలో జన్మదిన వేడుకలు జరుపుకోవడం, వారికి అన్నదానం చేయడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, డాక్టర్ అమ్ములూరి కనకరాజు, గంగవరం ప్రసాద్, హెల్ప్ ఫౌండేషన్ సభ్యులు సురేష్, మురారి, గిరితేజ, వృద్ధాశ్రమ నిర్వాహకులు రిషిత పాల్గొన్నారు.

ప్రతి విత్తనం మొక్కగా ఎదిగేలా ప్రయత్నం చేద్దాం

డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్



మాట్లాడుతున్న డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్



నల్లమల అడవిలో విత్తన బంతులతో డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి తదితరులు

కారెంపూడి: చెట్లు మనకు ప్రాణ వాయువును అందించడంతో పాటు మంచి ఫలాలను కూడా అందిస్తాయని.. అవి అందించే ప్రతి ఫలంలో విత్తనాలు కూడా ఉంటాయని.. ప్రతి విత్తనం మొక్కగా ఎదిగేలా చూడడం ధర్మమని.. ఆ ధర్మాన్ని సార్థకం చేద్దామని డ్వామా పీడీ కారెంపూడి మండల ప్రత్యేక అధికారి జి.జోసెఫ్‌కుమార్ పిలుపునిచ్చారు. కారెంపూడికి చెందిన పర్యావరణ వేత్త కొమెర అంకారావు (జాజి)తో కలసి కారెంపూడి శివారులో ఉన్న నల్లమల అడవిలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ టీమ్‌తో కలసి గురువారం ఆయన విత్తన బంతులు చల్లారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పీడీ జోసెఫ్ కుమార్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు ఆలోచన చేయాల్సిన క్లిష్ట పరిస్థితులు ప్రస్తుతం నెలకొన్నాయని ఉన్న అడవులను పరిరక్షించు కోవడంతో పాటు అడవులను 33.3 శాతానికి వృద్ధి చేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యక్రమాలు కూడా పండ్ల తోటల వృద్ధికి అలాగే ఇతర మొక్కల పెంపకానికి ప్రాధాన్యతనిస్తున్నాయన్నారు. పర్యావరణ వేత్త కొమెర అంకారావు విత్తన బంతులు చల్లడం ద్వారా మొక్కల సృష్టికి చేస్తున్న ప్రయత్నం అపూర్వమని ఆయనను పీడీ అభినందించారు. ఏపీడీ సీహెచ్ సురేంద్రకుమార్, ఎంపీడీవో జి.శ్రీనివాసరెడ్డి, ఏపీవో పి.కోటిరెడ్డి గురజాల క్లస్టర్ ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది నల్లమల అడవిలో విత్తన బంతులను చల్లారు. వర్షాకాలంలో మైదాన, ఇతర చిట్టడవుల ప్రాంతాలలో విత్తన బంతులు చల్లడం ద్వారా మొక్కలుగా ఎదగడానికి అవకాశం ఉందని, మొక్కల వృద్ధికి ఇదొక మంచి మార్గమని, ప్రభుత్వ యంత్రాంగం కూడా విత్తన బంతుల ఆవశ్యకతను గుర్తించి ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందని పర్యావరణ వేత్త జాజి పేర్కొన్నారు.

క్రీడలు మానసిక దృఢత్వానికి దోహదపడతాయి

మాచర్ల రూరల్: విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలూ ఎంతో అవసరమని, క్రీడలు మానసిక ఉల్లాసానికి, దృఢత్వానికి దోహదపడతాయని హెచ్‌ఎం ఐవీ నాగమణి తెలిపారు. గురువారం మండలంలోని కొప్పునూరు గ్రామం జెడ్పీహెచ్‌ఎస్‌లో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా క్రీడలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. జాతీయ విద్యా విధానం 2020లో ప్రారంభమై నాల్గవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శిక్షా సప్తాహ్ ద్వారా 22 నుంచి 28 వరకు పాఠశాలల్లో వారోత్సవాలు నిర్వహిస్తున్నాయని, అందులో భాగంగా నిర్వహిస్తున్న క్రీడలు విద్యార్థుల నైపుణ్యాన్ని వెలికితీసి వారిలోని క్రీడా స్ఫూర్తిని చాటేందుకు ఉపయోగపడతాయన్నారు. కబడ్డీ, ఖోఖో, కోలాటం వంటి క్రీడా పోటీలు నిర్వహించారు.



కొప్పునూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న హెచ్‌ఎం నాగమణి

కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాదరావు, పౌల్‌రాజ్, అప్పారావు, మధుబాబు, రామ్మోహన్, పెద యోసేపు, నారాయణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సమర్థంగా పనిచేసిన అధికారికి అభినందనలు

వెల్దుర్తి: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎన్నికల విధులను నిర్వహించేందుకు నెల్లూరు నుంచి వెల్దుర్తికి బదిలీపై వచ్చి ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించి గుర్తింపు పొందిన అధికారి చంద్రశేఖర్‌ను ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన వీడ్కోలు సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీడీవో నరసింహ మాట్లాడుతూ చంద్రశేఖర్ ఎన్నికల విధులను ఎంతో సమర్థవంతంగా నిర్వహించారన్నారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ పనిచేశారన్నారు. కిందిస్థాయి ఉద్యోగుల పట్ల ప్రేమతో వ్యవహరించి వారితో కలిసి విధులను పూర్తి చేశారన్నారు. బదిలీపై వెళ్తున్న తహసీల్దార్ చంద్రశేఖర్‌ను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏవో ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్ నాయక్, వీఆర్వోలు, వీఆర్‌ఏలు, పంచాయతీ కార్యదర్శులు, సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

అంటువ్యాధుల నివారణకు సమష్టిగా పనిచేయండి

మాచర్ల రూరల్ : గ్రామంలో పారిశుద్ధ్య పనులను మెరుగుపరచి అంటు వ్యాధుల నివారణకు అన్ని శాఖల అధికారులు సమష్టిగా పనిచేయాలని ఎంపీడీవో కె.సరోజినీదేవి అన్నారు. గురువారం మండలంలోని తాళ్ళపల్లి గ్రామంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించి ఆమె మాట్లాడారు. మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో సీజనల్ వ్యాధుల నివారణలో మెడికల్ సిబ్బంది ముఖ్య పాత్ర పోషించాలని, పంచాయతీ సిబ్బందితో కలిసి పారిశుద్ధ్య పనుల మెరుగుదలలో దోమల నివారణకు ఫాగింగ్ వంటివి చేయించాలని ఆదేశించారు. ఇంటింటికి వైరల్ ఫీవర్ సర్వే నిర్వహించి శాంపిల్స్ తీసుకొని వైద్యాధికారులకు అందించాలని ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లను ఆమె కోరారు. అక్కడే ఉన్న పాఠశాలకు వెళ్లి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం విద్యార్థులకు అందించాలని, కాచి వడపోసిన నీటిని వాడాలని సూచించారు. ప్రజల సౌకర్యార్థం ఆధార్ క్యాంపులను ప్రభుత్వం సచివాలయాల్లో ఏర్పాటు చేసిందని, ఈ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సర్పంచ్ బ్రహ్మనాయుడు, కార్యదర్శి ఆవుల వెంకట్రామయ్య, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



తాళ్ళపల్లి గ్రామంలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో సరోజనీదేవి

దోమల నివారణతో విషజ్వరాలు దూరం

మెడికల్ ఆఫీసర్ ప్రదీప్‌కుమార్‌రెడ్డి

రెంటచింతల: నివాస పరిసర ప్రాంతాల పరిశుభ్రతతోనే దోమలు నివారించడం జరుగుతుందని దీంతో డెంగీ, మలేరియా వంటి వ్యాధులు దరిచేరవని గోలి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ వి.ప్రదీప్ కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక బీసీ బాలుర సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులు, మలేరియా, డెంగీ వంటి వ్యాధులపై అవగాహన కల్పించి నివారణ చర్యలను వివరించారు. ప్రతి విద్యార్థి వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల శుభ్రతను పాటించాలని తెలిపారు. ఆహారం తినే ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. సంక్షేమ వసతి గృహం ఆవరణలో మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. హఠాత్తుగా తీవ్రమైన జ్వరం, భరించలేని తలనొప్పి, కండరాలు, కీళ్ళ నొప్పులు, ఆకలి మందగించటం, చర్మంపై దద్దుర్లు వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి మెరుగైన వైద్యం పొందాలన్నారు. అనంతరం వసతి గృహంలో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను, వారికి అందిస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో ఎ.ఆంజనేయులు, ఏఎన్‌ఎంలు ప్రమీల, విజయలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ మహేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ప్రదీప్‌కుమార్‌రెడ్డి

దోమల నివారణకు చర్యలు



మాచర్ల : దోమల నివారణకు పట్టణ పురపాలక సంఘ క్వారీలోని నీటిలో, పలు ప్రాంతాల్లో ఉన్న మున్సిపల్ బావుల్లో గురువారం గంబూషియా చేప పిల్లలను వేశారు. కార్యక్రమంలో పురపాలక సంఘ కమిషనర్ వెంకటదాస్, ఆర్వో షేక్ షబ్బీర్, మలేరియా అధికారి లక్ష్మయ్య, సూపర్‌వైజర్ నాగేశ్వరరావులు పాల్గొన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో వారు పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలంలో దోమల నివారణకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఫ్రైడేను డ్రై డేగా పాటించాలన్నారు. ఇంటి చుట్టుపక్కల బ్లీచింగ్ చల్లి, దోమలు పెరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటితో ముగియనున్న ఆధార్ ప్రత్యేక కేంద్రాలు

మున్సిపల్ కమిషనర్ వెంకట్‌దాస్



మాచర్ల: ఆధార్ అప్‌డేట్‌ను పట్టణానికి చెందిన ప్రతి ఒక్కరూ 27వ తేదీ సాయంత్రం లోపు పూర్తి చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకట్‌దాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని రోప్‌వే కాలనీ, తూర్పు బావి, సుద్దగుంతల సచివాలయాలలో ఆధార్ నమోదు, అప్‌డేట్ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శనివారం సాయంత్రం వరకు ఈ కేంద్రాలు పనిచేస్తాయన్నారు. దీనిని గమనించి 31 వార్డులలోని వారు ఆధార్ నమోదు, అప్‌డేట్, ఇతర మార్పుల కొరకు శనివారం లోపు ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పత్తి పంట పరిశీలన

క్రోసూరు: క్రోసూరులోని పత్తి పంటలను గురువారం క్షేత్రస్థాయిలో ఏవో వేణుగోపాల్ పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. పత్తి పంటలో రసం పీల్చే పురుగులైన పచ్చదోమ, తెల్లదోమ ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. వీటి నివారణకు తగు మోతాదులో మందులు పిచికారి చేయాలన్నారు. ప్రస్తుతం వర్షా కాలం పంటలలో పలురకాల కలుపు తీవ్రత ఎక్కువగా ఉంటుందని గుర్తుచేశారు. కలుపు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు కే సందీప్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ టూరిజంపై అవగాహన

అమరావతి: ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ ఆధ్వర్యంలో అమరావతి బౌద్ధ స్థూపం వద్ద హెరిటేజ్ వాక్, ఫ్రెండ్లీ టూరిజంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మేరీమాత హైస్కూల్‌కు చెందిన 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అమరావతి చరిత్ర గురించి తెలుసుకుని, ట్రావెల్ ఫర్ లైఫ్ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ మేనేజర్ బ్రహ్మానంద రెడ్డి, అసిస్టెంట్ టూరిజం మేనేజర్ చేతన్ జాదర్, అధికారులు నాయుడమ్మ, నాగేంద్ర కుమార్, అమరావతి యూనిట్ మేనేజర్ మణికుమార్, మస్తాన్ వలి, ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ సిబ్బంది పాల్గొన్నారు.

మిర్చి నారు పనుల్లో రైతులు

పెదకూరపాడు: వర్షాలు తగినంతగా పడటంతో రైతులు వ్యవసాయ పనుల్లో పూర్తిగా నిమగ్నమయ్యారు. మిర్చి పంటకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండటంతో మిరప నారు పోసేందుకు రైతులు సమాయత్తమయ్యారు. మిర్చి పంట సాగుకు పెదకూరపాడు నియోజకవర్గం పెట్టింది పేరు. ప్రతి ఖరీఫ్‌కు ఈ నియోజకవర్గంలో సుమారు 25 వేల హెక్టార్లలో పంట సాగు చేస్తారు. నియోజకవర్గంలోని సాగర్ కుడి కాలువ దిగువన ఆరుతడి పంటగా మిర్చిని అధికంగా పండిస్తున్నారు. గతేడాది మిర్చి నారు కొనుగోలు చేసి నష్టపోయిన రైతులు, ఈ ఏడాది సొంతంగా నారు పోసుకుంటున్నారు. మేలు జాతి నాణ్యమైన విత్తన రకాలను ఎంపిక చేసుకున్నామని రైతులు చెబుతున్నారు. నారు మళ్లు పోసుకునే రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారులు సూచించారు.



పెదకూరపాడులో నారు పనుల్లో కూలీలు

నర్సరీలకు ప్రభుత్వ గుర్తింపు తప్పనిసరి

రాజుపాలెం: నర్సరీ యజమానులు తప్పనిసరిగా ప్రభుత్వ గుర్తింపు కలిగి ఉండాలని ఉద్యాన శాఖాధికారి డి.నవీన్ తెలిపారు. మండల కేంద్రంలోని రాజుపాలెం సమీపంలో నర్సరీలను వ్యవసాయాధికారి వెంకటనర్సయ్యతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీ యజమానులతో మాట్లాడుతూ రైతులు మిరప విత్తనాలు తెచ్చి నాటమన్నప్పుడు బిల్లు ఉంటేనే నాటాలని తెలిపారు. ప్రతీ నర్సరీ యజమాని రిజిస్టర్‌లు మెయింటెన్ చేయాలన్నారు. పురుగు మందులు, పోషకాలను నమోదు చేయాలని సూచించారు. పరిశీలించిన నర్సరీలో మిరపనారు మొలక శాతాన్ని గుర్తించారు. రైతులకు ఇచ్చే నారులో తేడాలు ఉంటే నర్సరీ యజమానులే బాధ్యత వహించాలని హెచ్చరించారు.



ఖరీఫ్ వరి సాగుకు సిద్ధమవుతున్న రైతులు

కారెంపూడి: ఖరీఫ్ పంటల సాగుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. సాగర్ కాల్వలకు నీరు వచ్చే అవకాశం కన్పిస్తుండడంతో రైతులు వరి నారు మళ్లు సిద్ధం చేస్తున్నారు. బోర్ల కింద నారు పెంచుకుని కాల్వ రాగానే నాట్లు వేసేందుకు వీలుగా ముందుగానే నారు మళ్లు దమ్ము చేయించి విత్తనాలు చల్లుతున్నారు.

- కారెంపూడి మండలంలో మాగాణి ఆయకట్టు ఎక్కువగా సుమారు 15 వేల ఎకరాలుండడంతో సందడి ప్రారంభమైంది. అలాగే కాల్వల కింద సాగులో ఉన్న మెట్ట భూములను సైతం సాగుకు సిద్ధం చేస్తున్నారు.
- అయితే అవసరమైన నాణ్యమైన వరి విత్తనాలు మార్కెట్‌లో దొరకని పరిస్థితి కన్పిస్తోంది. రైతులు కోరుకుంటున్న బీపీటీ వెరైటీలలో నాణ్యమైన కంపెనీ విత్తనాలు షాపుల్లో దొరకడం లేదు. ఉన్న విత్తనాలు కూడా అధిక ధరలు పలుకుతున్నాయి. బీపీటీ 5204 రకం విత్తనాలు గతంలో సంచి రూ.1,200 ధర ఉంటే గత రెండు రోజుల్లోనే ఆ ధర రూ.1,400కు పెరిగింది. అదీ కూడా మంచి కంపెనీలు కాదు. ఇక సంకూర్ సోనా లాంటి విత్తనాలు 10 కిలోల విత్తన ప్యాకెట్ రూ.1,150 నుంచి రూ.1,200 దాకా ధర పలుకుతోంది.
- విత్తనాలు.. అందులోనూ నాణ్యమైన విత్తనాలు దొరకని పరిస్థితి.. అలాగే లభ్యమయ్యే విత్తనాలు కూడా అధిక ధరలకు అమ్ముతున్న పరిస్థితి పత్తి విత్తనాల సీజన్ నుంచి తలెత్తింది. ఆర్‌బీకేలకు ఇంకా విత్తనాలు రాకపోవడం కూడా ఈ పరిస్థితికి కొంత కారణం.
- ఇదిలా ఉంటే రైతులు మాత్రం ముందు భూములను సాగుకు సిద్ధం చేసుకునే పనిలో ఉన్నారు. ఆగస్టు చివరి నాటికి సాగర్ కాల్వలకు నీరు వచ్చే విధంగా కృష్ణమ్మకు వరద ఉధృతి కొనసాగుతున్నట్లు వార్తలు వస్తుండడంతో ఖరీఫ్ మాగాణి సాగు పనులు అలాగే సాగర్ ఆయకట్టు కింద ఉన్న మెట్ట భూములను రైతులను సాగుకు సిద్ధం చేసుకుంటున్న పరిస్థితి కన్పిస్తోంది.
- అలాగే కంది, ఇతర కూరగాయ పంటల సాగుకు అనుకూలంగా తమ భూములను దుక్కి దున్ని గొర్రు, గుంటకలు తోలి పంట వేయడానికి సిద్ధం చేస్తున్నారు. మిర్చి సాగుకు సైతం భూములను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే తమకు ఏ రకం మిర్చి నారు అవసరమో దాని కోసం నర్సరీలకు రైతులు ఆర్డర్ చేస్తున్నారు.
- బీళ్లుగా ఉన్న మాగాణి భూములను శుభ్రం చేసుకుని వాటిని దుక్కి దున్నుతున్నారు. ఆగస్టులో ఖరీఫ్ వరి సాగు పనులు ఇంకా ముమ్మరం అయ్యే పరిస్థితులు కన్పిస్తున్నాయి. ఈలోగా విత్తనాల కొరత లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు



వరి నారు మడిని ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న దృశ్యం

మంజునాథరెడ్డి సేవలు ప్రశంసనీయం

మాచర్ల రూరల్: అత్యంత ప్రతిష్టాత్మకమైన పల్నాడు ప్రాంతంలో సార్వత్రిక ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించి ప్రజలకు, ప్రభుత్వానికి, ఉద్యోగులకు విలువైన సేవలందించిన తహసీల్దార్ మంజునాథరెడ్డి సేవలు అమూల్యమని డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు కొనియాడారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న మంజునాథరెడ్డికి ఘనంగా సన్మానించి మాట్లాడారు. ఎన్నికలలో సమస్యాత్మకమైన గ్రామాలలో ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా చక్కని ప్రణాళికతో, ఉద్యోగుల సహాయ సహకారాలతో ఆయన పనిచేసిన విధానం పలువురికి ఆదర్శమన్నారు. ఓటింగ్ శాతం పెంచటంలో ఓటర్లకు అవగాహన కల్పించటంలో ఆయన తీసుకున్న చర్యలు, పనిచేసిన తీరుతోటి ఉద్యోగులకు భరోసా కల్పించిందన్నారు. మూడు నెలలకు పైగా మాతో పనిచేసి మా అందరికీ మార్గదర్శకులుగా ఉన్న మంజునాథరెడ్డి బదిలీపై వెళ్లటం బాధగా ఉన్నా, ఉద్యోగులకు బదిలీ అనేది తప్పనిసరి అని, పనిచేసిన చోట ప్రజల మన్ననలు పొందటం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ఎం.శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్లు వై రంగారావు, ఎస్‌కే వలి, సర్వేయర్ సాల్మన్‌రాజ్, టైపిస్టు నాగవలి, వీఆర్వోలు భాస్కర్, ప్రశాంతి, నాగలక్ష్మి, ప్రవీణ, జలీల్, నంద, రవికుమార్, గోపాల్‌రెడ్డి, వెంకట్రావు, కంప్యూటర్ ఆపరేటర్ శ్రీనివాసరావు, సతీష్‌లున్నారు.



తహసీల్దార్ మంజునాథరెడ్డిని సత్కరిస్తున్న డీటీ శ్రీనివాస్, ఆర్‌ఐలు, వీఆర్వోలు, సిబ్బంది

కుష్ఠు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



ఇంటింటి సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది



మాచవరంలో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

గ్రామాలలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రెంటచింతల: కుష్ఠు వ్యాధి పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి అన్నారు. జూలై 18 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు నిర్వహిస్తున్న జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని వివిధ గ్రామాలలో కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించే ఇంటింటి సర్వేను ఆయన ప్రారంభించి మాట్లాడారు. 11 గ్రామాలలో 42 బృందాలను ఏర్పాటు చేసి ఇప్పటి వరకు 690 ఇళ్లను, 2,475 మందిని పరీక్షించి 10 మంది కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించడం జరిగిందన్నారు. చర్మంపై స్పర్శలేని మచ్చలు, చెవులపై, వీపుపై, ఎదపై, నొప్పి లేని బొడిపెలు ఉన్నా, కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం, కనురెప్పలు మూతపడకపోవడం, ముక్కుదిబ్బడ, ముక్కులో నుంచి రక్తం కారడం, కాళ్లు, చేతులు తిమ్మిర్లు, అరచేతులు, అరికాళ్లలో స్పర్శ కోల్పోవడం, చల్లని, వేడి వస్తువులను గుర్తించలేకపోవడం, చేతుల నుంచి వస్తువులు జారిపోవడం తదితర లక్షణాలను కుష్ఠు వ్యాధి లక్షణాలుగా గుర్తించాలన్నారు. ఈ లక్షణాలు ఉన్న వారు మీ ఇంటి వద్దకు ఆరోగ్య కార్యకర్తలు సర్వేకు వచ్చిన సమయంలో చూపించుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి వైద్య సేవలు పొందవచ్చన్నారు. ఆరోగ్య కార్యకర్త వద్ద నుంచి ఎం.డి.టి మందులు ఉచితంగా పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో శర్మ, ఎంపీహెచ్‌ఏ ఖాసిం, ఆరోగ్య కార్యకర్తలు తదితరులున్నారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన అవసరం

మాచవరం: కుష్ఠు వ్యాధిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, ప్రాథమిక దశలోనే గుర్తిస్తే వ్యాధిని పూర్తిగా నివారించవచ్చని పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసాదరావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో కుష్ఠు వ్యాధిపై అవగాహనా కార్యక్రమాలు, ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 2 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. కుష్ఠు వ్యాధిగ్రస్తులు తగిన జాగ్రత్తలు పాటిస్తూ కుటుంబసభ్యులతో కలిసి జీవించ వచ్చని, గర్భం ద్వారా బిడ్డకు సంక్రమించదన్నారు. వ్యాధి సోకిన వ్యక్తి ముక్కు ద్రవం ద్వారా దగ్గు లేదా స్పర్శ ద్వారా వ్యాప్తి చెందుతుందన్నారు. వ్యాధి నిరోధక శక్తి అధికంగా 95 శాతం ఉంటే అభివృద్ధి చెందదన్నారు. వ్యాధిని గుర్తించి సకాలంలో వైద్యం అందిస్తే నివారించవచ్చని తెలియజేశారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పిడుగురాళ్ల రూరల్: కుష్ఠు వ్యాధి అంతగా అంటు వ్యాధి కాదని, వ్యాధి సోకిన వారితో అత్యంత సన్నిహితంగా ఉన్నప్పుడు మాత్రమే సంక్రమిస్తుందని డాక్టర్ ప్రవీణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని కామేపల్లి గ్రామంలో కుష్ఠు వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటి సర్వే చేపట్టారు. వ్యాధిపై ప్రజలకు అవగాహన కలిగిస్తూ కరపత్రాలు అందించారు. ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో పి.సాయి, ఏఎన్‌ఎం విజయకుమారి, ఆశా వర్కర్లు మరియమ్మ, పద్మ పాల్గొన్నారు.



సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది